క్లుప్తంగా

క్రైస్తవుల సంక్షేమానికి అండగా ప్రభుత్వం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో క్రైస్తవులు సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడిలోని మహిమ స్వస్థతశాల వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ స్వస్థత ఆశీర్వాద సభలు–2023లో ఎమ్మెల్యే కన్నబాబు మంగళవారం పాల్గొన్నారు. నియోజవర్గంలో పాస్టర్లకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సహకరిస్తామన్నారు. పార్టీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల జాషువా తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించండి



సమస్యపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కరప: గ్రామంలోని మెరకవీధి, శివాలయం వీధి, పల్లపువీధి తదితర ప్రాంతాల్లో లో–ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి వి.సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనివల్ల తమ ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. శివాలయం సమీపంలోని భవన నిర్మాణ కార్మికుల భవనం పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుంటే సదరు సంఘం నాయకులు అభ్యంతరం తెలిపారని, వాళ్లతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు వెనుతిరిగారు.

దేవాలయ పాలకమండలిలో సభ్యత్వం అభినందనీయం

కాకినాడ రూరల్: రమణయ్యపేట పరిధి గైగోలుపాడులో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో రూరల్ మండల నాయీబ్రాహ్మణ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ అధ్యక్షుడు కోట ఉమా అచ్యుత రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ హాజరై మాట్లాడారు. దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా నాయీ బ్రహ్మణులకు అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. తమ కమ్యూనిటీ హాలు ప్రహరీ, బాత్‌రూమ్, రోడ్డు సదుపాయం కల్పించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మట్టే ఆదినారాయణ, నాగమణి మెమోరియల్ రోటరీ బ్లడ్ సెంటర్ పెద్దాపురం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ రక్తదాతలను అభినందించారు. డాక్టర్ పైడా నాగేశ్వరరావు, డాక్టర్ వర్చస్వి, రోటరీ క్లబ్ పెద్దాపురం ప్రెసిడెంట్ టి.దొరబాబు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

బాలాజీచెరువు: వేసవి కాలం నేపథ్యంలో రామరావుపేట లయన్స్‌హాల్లో ఉచిత హోమియోపతి మందు పంపిణీ ప్రారంభమైంది. క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ఈ పంపిణీని ప్రారంభిస్తూ ఎండకాలంలో తరచుగా వచ్చే సమస్యల రక్షణకు గ్లోనైన్ అనే మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. మెయిన్‌రోడ్‌లోని సోనా షాపింగ్‌మాల్, దేవాలయ వీధి బాదం సుబ్రమ్మణ్యం సన్స్ ప్రాంతాలలో పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ ఉప గవర్నర్ సూర్యనారాయణ, అధ్యక్షులు ఎస్.మురళీకృష్ణ, జీఎల్ జగన్నాథరావు, పులవర్తి కుమార్ పాల్గొన్నారు.

నేడు కేసీబీఎస్ వైద్య శిబిరం

కాకినాడ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సంఘ ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి తెలిపారు. ట్రస్ట్ హాస్పటల్ ఆధ్వర్యంలో కేసీబీఎస్ సంస్థ సభ్యులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, కంటివైద్య విభాగాలకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ: ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగ సంఘాల నాయకులు కాకినాడ ధర్నా చౌక్ వద్ద మంగళవారం చేపట్టిన ధర్నాకు రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదని, ఉద్యోగులంతా ఇప్పటికైనా నిర్లక్ష్యం వహించకుండా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమంలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ధర్నాలో ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షులు పితాని త్రినాథరావు, రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంసాని శ్రీనివాస్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం బొప్పరాజును ఉద్యోగ నాయకులు సన్మానించారు.

సాయంత్రాన శుభ్రత దిశగా..



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్



కమిషనర్‌తో సమావేశమైన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో ఎస్‌ఈ సత్యకుమారి

- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ వెల్లడి
- వాణిజ్య ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్యానికి ప్రణాళిక
- మెయిన్‌రోడ్డు 8వ సర్కిల్‌లో ట్రయల్ రన్‌కు ఆదేశం

కాకినాడ: వాణిజ్య ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే క్రమంలో ఈవెనింగ్ శానిటేషన్‌పై దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల సూచించారు. ఇందుకోసం కాకినాడ 8వ సర్కిల్లోని మెయిన్ రోడ్ ప్రాంతాన్ని ఎంపిక చేసి ట్రయల్ రన్ చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం ఆయన అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావుతో కలిసి పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలతో సమీక్షించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు మూడు విభాగాలూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మెయిన్ రోడ్‌లోని మసీదు నుంచి జగన్నాథపురం వంతెన వరకు, ఆ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అనుబంధ రహదారుల్లోనూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు రెండు వారాల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఆ తరువాత మిగిలిన వాణిజ్య ప్రాంతాల్లో ఈ పద్ధతి అవలంబించాలని సూచించారు. ఇందులో భాగంగా ఒక ట్రాక్టర్, ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఏర్పాటుచేసి వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. ఆయా సచివాలయ కార్యదర్శులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, వారి పరిధిలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు ? ఎంత మేరకు రహదారులు, డ్రైనేజీలు ఉన్నాయి? ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి? తదితర అంశాలపై సమగ్ర అవగాహన ఉండాలన్నారు.

పూడికతీతపై సమీక్ష

నగరంలో జరుగుతున్న పూడికతీత పనులపై కమిషనర్ సమీక్షించి ఎంత శాతం పూర్తయినదీ, ఎంత కాలం పడుతుంది.. అమలు చేస్తున్న ప్రణాళిక తదితర అంశాలపై ఆరా తీశారు. ఇంజినీరింగ్ విభాగంతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా ఈ పనులను పర్యవేక్షించాలన్నారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై ఎమ్మెల్యే ద్వారంపూడి భేటీ

నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్‌తో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో కలసి సమావేశమైన ఎమ్మెల్యే పలు అభివృద్ధి అంశాలపై ఆయనతో చర్చించారు. రహదారులు, డ్రైనేజీలు, విద్యుద్దీపాలు, టిడ్కో ఇళ్ల తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. అలాగే సాధారణ ప్రాంతాల్లో రూ.90, మురికివాడల్లో రూ.30 చొప్పున వసూలు చేస్తున్న యూజర్ చార్జీలను సవరించే అంశం కూడా చర్చకు వచ్చింది. సెమీ స్లమ్స్‌లో రూ. 60 వసూలు చేసే అంశంపై కూడా మాట్లాడారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీఈ మాధవి, వాటర్ వర్క్స్ డీఈ ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- జయలక్ష్మి సొసైటీ పాలకవర్గానికి ఎమ్మెల్యే కన్నబాబు హామీ



ఎమ్మెల్యే కన్నబాబుతో సొసైటీ చైర్మన్ త్రినాథరావు, డైరెక్టర్లు

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు తమ వంతు సహకరిస్తానని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సొసైటీ నూతన పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు, డైరెక్టర్లు చింతా సుబ్బారావు, గౌరీ శంకర్ తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ డిపాజిటర్లకు న్యాయం చేసేందుకు నూతన పాలకవర్గం చేపడుతున్న చర్యలను, కేసు ప్రగతిని త్రినాథరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపాటిర్లకు వడ్డీతో సహా చెల్లించేందుకు పనిచేయాలని, రికవరీ కోసం తమ సహకారం ఉంటుందన్నారు.

హుషారుగా జగనన్నే మా భవిష్యత్



యండమూరులో మహిళను ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కరప: మండల పరిధిలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు గృహసారథులు, గ్రామసచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో కలసి జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. గొర్రిపూడి, ఉప్పలంక తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న వివిధ పథకాలు, అదే సమయంలో గత ప్రభుత్వంలో చంద్రబాబు వంచన వివరిస్తూ జగనే మళ్లీ మన సీఎం కావాలని వివరించారు. ఇందుకు ప్రతిగా జగనన్నే మా నమ్మకం అంటూ గృహిణులు తమ ఇళ్లకు స్టిక్కర్లను అతికించుకున్నారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కాల గణేష్, పెంకే సత్తిబాబు, చీకాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతగా ఉంటాం

- రాష్ట్ర రెవెన్యూ టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు సూరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సూరిబాబు

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యవర్తిత్వం, దళారీ వ్యవస్థను రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగులకు భరోసా కల్పించారని రాష్ట్ర రెవెన్యూ టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె.సూరిబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం కాకినాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్న సీఎం జగన్‌కు ప్రతి ఉద్యోగి రుణపడి ఉంటారన్నారు. గతంలో ఈపీఎఫ్, ఈఎస్ఐ ఎంత కట్ చేస్తున్నారో, ఎంత జమ అవుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. గతంలో 7 నుంచి 9 నెలల వరకు జీతాలు రానప్పుడు మాట్లాడని వారు ఇప్పుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ప్రభుత్వంపై ధర్నాలకు పిలుపునివ్వడం సరికాదని, ఈ విధానాన్ని తమ సంఘం పూర్తిగా ఖండిస్తుందన్నారు. ఏపీఏజేసీ అమరావతి ఇచ్చిన పిలుపునకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం దూరంగా ఉంటుందని తెలియజేస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వం మరెన్నో ప్రయోజనాలు తొందరలోనే నెరవేరుస్తుందన్న పూర్తి నమ్మకం ఉందన్న ఆశాభావాన్ని సూరిబాబు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ జేఏసీ గౌరవాధ్యక్షుడు వీఎస్ దివాకర్, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా ఆది శంకరుల జయంతి



ప్రత్యేక అలంకరణలో ఆదిశంకరాచార్యులు



శంకర జయంతి నిర్వహించిన వాకర్స్ సంఘం

బోట్‌క్లబ్: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆది శంకరాచార్యుల జయంతిని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

బోట్‌క్లబ్ వాకర్ల ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేట బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శంకరాచార్య జయంతి నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు శంకరాచార్య చిత్రపటానికి నివాళులర్పించారు.

రంగు.. ఒట్టి హంగు!

- మామిడి పండ్ల పక్వానికి రసాయనాల వినియోగం
- స్వచ్ఛందంగా మగ్గినవంటూ చెట్ల కింద విక్రయాలు



నగరంలోని ఒక కళాశాల ఆవరణలో చెట్ల కింద విక్రయిస్తున్న మామిడి పండ్లు

బాలాజీచెరువు: పండ్లలో రారాజు మామిడి. సంపన్నుడి నుంచి సామాన్యుడి వరకూ అంతా దీని రుచిని ఆస్వాదించాలని కోరుకుంటారు. వేసవి కాలంలో మార్కెట్లను ముంచెత్తే ఈ మధురఫలాన్ని కొనే ముందు చాలా అప్రమత్తంగా పరిశీలించి కొనాలని వైద్యులు, పెద్దలు సూచిస్తున్నారు. కొన్ని చోట్ల పండ్లను పరిశీలన చేస్తే పైన పటారం లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో మాగించి పై తొక్క రంగు మారేలా చేసి విక్రయించేస్తున్నారు. నగరంలోని ఓ కళాశాలలో దాదాపు 100 చెట్లు వరకూ ఉండగా వాటి కిందే వాటికవే ముగ్గినవంటూ ఆ చెట్ల కిందే విక్రయించేస్తున్నారు.

ఆరోగ్యానికి హాని కలిగించే ఈ కాల్షియం కార్బైట్ వినియోగాన్ని 2012లో ప్రభుత్వం నిషేధించింది. సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు పక్వతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలిన్‌తో మాగుతాయి. ఇథిలిన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణ రంగు, రుచి, వాసన వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

ప్రత్యామ్నాయ రసాయనాలు

తప్పని పరిస్థితుల్లో కాయలను మాగబట్టేందుకు వినియోగదారుకు హాని కలిగించని ఇథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. దీనిని 24 గంటల పాటు తగిలేటట్టు ఉంచితే ఐదు రోజుల్లో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హానీ లేకుండా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిన్ కలిపి అందులో మంచిగా ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మారతాయి. గడ్డి కింద కాయలను మాగబెట్టాలనుకుంటే మరింత సురక్షితం.

వ్యత్యాసాన్ని గమనించండి

సహజంగా మాగిన పండు రంగు కొంత పసుపు, కొంత ముదురు ఆకుపచ్చగా ఉంచి పండు లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగినవి ఒకే విధంగా కాంతివంతంగా లేత పసుపు రంగు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి. కృత్రిమంగా మాగినవి దూరం నుంచే వాటి వాసన బట్టి చెప్పవచ్చు.

సీజన్ రాకముందే కొనవద్దు



సాధారణంగా మామిడి పండ్లు ఏప్రిల్ చివరి వారం, మే నెలలో పూర్తి స్థాయిలో వస్తాయి. ముందుగానే వచ్చిన మాగించిన పండ్ల వల్ల చిన్నపిల్లలో దగ్గు వంటి సమస్యలు వస్తాయి. పండ్లను ముందుగా ఉప్పు కలిపి 15 నుండి 20 నిమిషాలు నీటిలో ఉంచి తర్వాత తడి లేకుండా తినాలి. సాధ్యమైనంత వరకూ తొక్కలేకుండా తినాలి.

– డాక్టర్ మాలోతు రమేష్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి, జేఎన్‌టీయూకే

ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా..

- మాజీ ఎమ్మెల్యే వనమాడి కుటిలయత్నం
- బయటపెట్టిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కొండబాబు దుష్ప్రచారాన్ని ఖండిస్తున్న మహిళలు

కాకినాడ: 'స్పందన'కు వచ్చే అర్జీదారులను ప్రలోభపెట్టి రాజకీయంగా టీడీపీకి ప్రయోజనం కలిగించాలన్న మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుటిలయత్నానికి 24 గంటలలోనే బ్రేక్ పడింది. వాస్తవాన్ని గమనించిన వైఎస్సార్ సీపీ వాస్తవాన్ని బయటపెట్టడంతో టీడీపీ శ్రేణులు భంగపడాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే కాకినాడ 24వ డివిజన్ కుంతీదేవిపేటకు చెందిన మహిళలు తమకు మంజూరైన స్థలాల జాడ తెలియడం లేదంటూ సోమవారం స్పందనకు వచ్చారు. అదే సమయానికి అక్కడకు వచ్చిన కొండబాబు వీరిని అడ్డుపెట్టుకుని రాజకీయంగా తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. కొత్తపట్టాలు చేతికి అందాలంటే ఉన్న లబ్ధిదారులు ఎవరైనా మరణిస్తే తప్ప ఇవ్వలేమని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారంటూ బాధితుల ద్వారా అక్కడ ఉన్న మీడియాను పిలిచి లేనిపోని హడావుడి చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మంగళవారం సదరు మహిళలను విచారించగా, తామెవ్వరూ కొండబాబును కలవలేదని, కలెక్టరేట్‌కు వచ్చిన తమను పిలిచి రాజకీయ ప్రచారం కోసం వినియోగించుకున్నారని మీడియాకు వివరించారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తమ సమస్య తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని ధన్యవాదాలు చెప్పారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్ వద్ద టీడీపీ, జనసేన నాయకులు రాబందుల్లా వేచిచూస్తూ రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నారన్నారు. ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులకు పట్టాలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి మంజూరు కావలసి ఉందన్నారు. త్వరలోనే స్థలాన్ని కూడా చూపిస్తామని స్పష్టం చేశారు. లేని వివాదాన్ని సృష్టించి రాజకీయంగా వాడుకోవద్దని ఆయా పార్టీలకు హితవు పలికారు. టీడీపీ హయాంలోనే ఓ లబ్ధిదారుడు చనిపోతే తప్ప కొత్తవారికి పింఛన్‌కు అవకాశం ఇవ్వలేని దౌర్భాగ్యస్థితి ఉందని మండిపడ్డారు.

అల్లూరి కవితల పోటీలు

కాకినాడ కల్చరల్: అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో అల్లూరి శత వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఔత్సాహికులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నామని వేదిక ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాట స్ఫూర్తి', 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ నిరతి' అంశాలలో 20 పంక్తులకు మించకుండ కవితలు రాసి 30వ తేదీ లోపు పంపించాలని తెలిపారు. పీఎస్ఎస్‌పీ శాస్త్రి, లిటరరీ సెక్రటరీ, అల్లూరి సీతారామరాజు స్మారక కళా వేదిక, ఏపీ గవర్నమెంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం, తహసీల్దార్ కార్యాలయం కాంపౌండ్, కాకినాడ అడ్రస్‌కు పోస్టు ద్వారా కానీ, నేరుగా గానీ వచ్చి కవితలు అందజేయాలని పంపన కోరారు. మే 7న జరగనున్న అల్లూరి శతవర్ధంతి కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 98480 76620 మొబైల్‌ను సంప్రదించాలని కోరారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



బార్ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: విజయవాడ న్యాయవాది బత్తిన హరిరామ్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా ఎస్‌వీఎస్ శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు వల్ల బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. దీనివల్ల పీఆర్ కళాశాల రోడ్డు, ప్రభుత్వాస్పత్రి వెనుక, వెంపటివారి వీధి, కొమ్మిరెడ్డివారి వీధి, టీటీడీ వెనుక, అవసరాల వారి వీధుల్లోన్లు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వార్షిక మరమ్మతుల్లో భాగంగా రాజారామోహన్‌రాయ్ రోడ్డు, సాలిపేట, బాలాజీచెరువు సెంటర్, వినుకొండవారి వీధుల్లోను విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ప్రసాద్ తెలిపారు. ఈనెల 27వ తేదీ గురువారం చిట్టూరి వారి వీధి, పెద్ద మార్కెట్ ఏరియా, లక్ష్మీనారాయణ కంపెనీ వీధి, రంగయ్యనాయుడు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, బ్యాంకు పేట, సినిమారోడ్డు, రెల్లివీధి, కాశికాయల వారి వీధి, సూర్యనారాయణపురం, గొల్లల వీధి, బ్రాహ్మణ వీధి, బొర్రా వారి వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 20వ డివిజన్ రణదీప్‌నగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఇంటింటికీ వెళ్లిన ద్వారంపూడి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. నిరంతరం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆలోచించే సీఎం వద్ద ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి సీఎంను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి కోరారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వెలమల మల్లేశ్వరరావు, స్థానిక నాయకులు కొప్పనాతి సత్యనారాయణ, చిక్కాల సుధాకర్, మల్లాడి నరసింహమూర్తి, జగడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మలేరియా నివారణ దినోత్సవం

కాకినాడ క్రైం: జిల్లాలో మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రొణంకి రమేష్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫ్రైడే డ్రై డేపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించి నిర్వహణలో భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన ప్రతాప్‌నగర్ యూపీహెచ్‌సీలో దోమల నియంత్రణకు ఉపకరించే పరికరాలు, రసాయనాలు, డెంగీ, మలేరియా కిట్లను సమకూర్చారు.

నిత్యావసరాల వితరణ

కరప: వలసపాకలలోని అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సంస్థ మంగళవారం నిత్యావసరాలు, దుస్తులు, వంటసామగ్రి అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి స్థానిక ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న 5 కుటుంబాలకు చెందిన బాధితులు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు రెడ్‌క్రాస్ సంస్థ వంట సామగ్రి, దోమతెరలు, దుప్పట్లు, దుస్తులు అందజేసింది. అలాగే సర్పంచ్ వాసంశెట్టి రామారావు కాయకూరలు, కిరాణా సామగ్రి సమకూర్చారు.

వెంటూరికి 'లయ విద్యా ప్రవీణ' ప్రదానం



వెంటూరి వెంకట రామారావును సత్కరిస్తున్న శిష్య బృందం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో ప్రముఖ డోలు విద్వాంసుడు, ఆల్ ఇండియా రేడియో ఏ గ్రేడ్ ఆర్టిస్టు వెంటూరి వెంకట రామారావుకు మంళవారం ఆయన శిష్య బృందం సత్కారం చేసి లయ విద్యాప్రవీణ బిరుదు ప్రదానం చేసింది. వెంటూరి చేసిన సంగీత సేవలను ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి కొనియాడారు. అనంతరం ఏర్పాటుచేసిన నాదస్వర కచేరి అలరించింది. చివరిగా వృద్ధ కళాకారులను సన్మాన గ్రహీత సత్కరించారు. సరస్వతీగాన సభ అధ్యక్షుడు ఆంజనేయమూర్తి, మునుగంటి వెంకట్రావు, జి.శేషగిరిరావు, వాద్య విద్వాంసులు పాల్గొన్నారు.